క్లుప్తంగా

సరిహద్దులో తనిఖీలు



కృష్ణా: మండలంలోని రాష్ట్ర సరిహద్దులోని చేగుంట చెక్‌పోస్టులో సోమవారం వాహనాల తనిఖీ చేశారు. కర్ణాటక నుంచి వచ్చే ప్రతి వాహనాన్ని తనిఖీ చేయడంతో పాటు వాటి నంబర్లను నమోదు చేస్తున్నట్లు సీఐ రాంలాల్ తెలిపారు. సరిహద్దులో కడెచూర్ గేట్ వద్ద తనిఖీ చేస్తున్న కర్ణాటక పోలీసులతో కూడా ఈ విషయంపై చర్చించారు.

మద్యం పట్టివేత



కృష్ణా: మండల సరిహద్దులో గల చెక్‌పోస్టులో సోమవారం సాయంత్రం ఎక్సైజ్, ఎస్ఎస్‌బీ, స్థానిక పోలీసులు సంయుక్తంగా వాహనాలను తనిఖీ చేస్తున్న సమయంలో గోవా నుంచి తీసుకొచ్చిన 6.5 లీటర్ల మద్యం లభించిందని ఎక్సైజ్ ఎస్ఐ సతీష్ తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కర్ణాటక నుంచి వచ్చే ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోండి



నర్వ: మండల ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్ఐ కురుమయ్య అన్నారు. సోమవారం పాథర్చేడ్, ఉందేకోడ్, లంకాలలో కేంద్ర సాయుధ బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి శాంతియుత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం కృషి చేస్తుందన్నారు. ప్రజలందరికీ పోలీసులు ఎల్లవేళలా అందుబాటులో తోడుంటారన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కేంద్రబలగాలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు.

లౌకిక పార్టీలకే పట్టం కడుదాం

అమరచింత: దేశంలోని ప్రజలకు శాంతియుత వాతావరణం కల్పిస్తూ.. వారి అభివృద్ధికి బాసటగా ఉన్న లౌకిక పార్టీలకే ఓటువేసి గెలిపించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, కర్నూల్ మాజీ ఎమ్మెల్యే గఫూర్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం రాత్రి సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల తెలంగాణగా మార్చిన సీఎం కేసీఆర్‌కు అసెంబ్లీ ఎన్నికల్లో వ్యతిరేకంగా ఓటు వేసి ఓడించాలని కోరారు. బీజేపీ ప్రజల మధ్య మత విద్వేషాలు కలిగించి అమాయక ప్రజల ప్రాణాలను బలికొంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వాకిటి శ్రీహరికి మద్దతు ఇచ్చి గెలిపించాలని సీపీఎం నాయకులు, కార్యకర్తలకు కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జబ్బార్, మండల కార్యదర్శి జీఎస్ గోపి, రాజు, ఆర్ఎస్ రమేష్, వెంకటేష్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో మూడు గేదెలు మృతి

గోపాల్‌పేట: కరెంటు షాక్ తగిలి మూడు గేదెలు మృతి చెందిన ఘటన మండల కేంద్రానికి సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. రైతు తెలిపిన వివరాల మేరకు.. గోపాల్‌పేట ఈదమ్మగడ్డకు చెందిన చంద్రయ్య కుమారుడు దేవయ్యకు చెందిన మూడు గేదెలు శివారులోని పొలంలో మేత మేస్తున్నాయి. అనుకోకుండా కరెంటు వైరు తెగి గేదెలపై పడింది. దీంతో మూడు గేదెలు మరణించాయి. విషయం తెలుసుకున్న వెటర్నరీ డాక్టర్ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. రూ.రెండున్నర లక్షలు నష్టపోయానని, ప్రభుత్వమే ఆదుకోవాలని రైతు కోరాడు.

కొనుగోలు కేంద్రాల తూకాల్లో మోసాలు

పాన్‌గల్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల్లో మోసాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళావతమ్మ, శ్రీరామ్ అన్నారు. సోమవారం మండలంలోని తెల్లరాళ్లపల్లి కొనుగోలు కేంద్రంలోని తూకాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కేంద్రాల్లో ప్రతి 40 కిలోల బస్తాకు 41 కిలోల తూకం వేస్తున్నారని అన్నారు. అరకిలో ఖాళీ బస్తా తూకం పోను మరో అరకిలో వడ్లు ఎక్కువగా తీసుకుంటుండటంతో రైతులు నష్టపోతున్నారన్నారు. జిల్లాలోని చాలా కొనుగోలు కేంద్రాల్లో వడ్లు తరుగు తీస్తున్నారన్నారు. దీంతో రైతులు ప్రతి 40 కిలోల బస్తా వద్ద అర కిలోవడ్లు నష్టపోతున్నారన్నారు. ప్రతి లారీ లోడుకు సుమారుగా రూ.6 వేల విలువ గల వడ్లు రైతులు నష్టపోతున్నారన్నారు. తరుగుపై రైతులు ప్రశ్నిస్తే వారి ధాన్యాన్ని తూకం చేయడంలేదన్నారు.

ఆశీర్వదించి.. అసెంబ్లీకి పంపండి



బీఆర్ఎస్‌లో చేరిన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

నారాయణపేట: నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సకలజనులందరూ మరోసారి ఆశీర్వదించి అసెంబ్లీకి పంపాలని బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి ఓటర్లను కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నారాయణపేట ఆటో యూనియన్ నాయకులు 50 మందికి కండువాలు కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే ఆహ్వానించారు. ధన్వాడ మండల కేంద్రంలోని బీజేవైఎం టౌన్ అధ్యక్షుడు చరణ్‌దాస్, కృష్ణయ్యగౌడ్ ఆధ్వర్యంలో 30 మంది బీజేపీ, కాంగ్రెస్ చెందిన కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, ప్రగతే లక్ష్యంగా ముందుకు సాగుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వ పనితీరును చూసి ప్రజలు స్వచ్ఛందంగా బీఆర్ఎస్‌లోకి రావడం విజయానికి సంకేతమన్నారు. గత ప్రభుత్వాల హయాంలో రాష్ట్ర అభివృద్ధి ఆమడదూరంలో ఉండడంతో నీళ్లు, నిధులు, నియామకాలే లక్ష్యంగా సాధించుకున్న బంగారు తెలంగాణలో పదేళ్లలో నారాయణపేట అన్ని విధాలుగా ప్రగతిలో పరుగులు పెడుతున్నదన్నారు.

ఐటీ దాడుల వెనుక కాంగ్రెస్ కుట్ర

ఎన్నికల వేళ బీఆర్ఎస్ అనుయాయులపై ఐటీ దాడులు చేయడం వెనుక కాంగ్రెస్ పార్టీ కుట్ర దాగి ఉందని బీఆర్ఎస్ నియోజవర్గ యూత్ అధ్యక్షుడు శ్రీపాద్, గందె చంద్రకాంత్ ఆరోపించారు. సోమవారం వారు మాట్లాడారు. మా వ్యాపారస్తులపై ఐటీ దాడులు కాంగ్రెస్ పార్టీ ఉసిగొల్పడంతోనే జరిగి ఉంటాయన్నారు. మీతాటాకు చప్పుళ్లకు ఇక్కడ ఎవరూ భయపడే పరిస్థితిలో లేరన్నారు. నారాయణపేట వర్తక వ్యాపారస్థులు ఇటీవల పార్టీలకతీతంగా సమావేశం ఏర్పాటు చేసుకొని అభివృద్ధి చేసే వారి వెంటే ఉంటామని మద్దతు తెలిపారన్నారు. బీఆర్ఎస్‌కు మద్దతు తెలుపుతున్నారనే నేపథ్యంతో వారందరిని గుర్తించి ఐటీ దాడులు చేయించారని విమర్శించారు. ఇంతటి దిగజారుడు రాజకీయాలు ఎప్పుడూ చూడలేదన్నారు. సమావేశంలో విజయ్‌సాగర్, చెన్నారెడ్డి, సంపత్‌కుమార్ ఉన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

అభివృద్ధిని చూసి ఓటెయ్యండి

మరికల్: నియోజకవర్గంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలు గుర్తించి ఓటు వేయాలని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ సురేఖ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిని మూడోసారి అసెంబ్లీకి పంపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో రామస్వామి, తిరుపతయ్య, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్, బసంత్, రాములు, మల్లేష్, రాజేశ్వర్‌రెడ్డి, నరహరి, ఆంజనేయులు, లక్ష్మయ్య, గోపి పాల్గొన్నారు.

మద్యం దుకాణాల బంద్

మహబూబ్‌నగర్ క్రైం: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా మంగళవారం సాయంత్రం 5గంటల నుంచి 30న సాయంత్రం వరకు జిల్లాలో ఉన్న మద్యం దుకాణాలు మూత పడనున్నాయి. పోలింగ్ జరుగుతున్న రోజు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండటానికి ఎన్నికల నిబంధనల ప్రకారం 48గంటల పాటు లిక్కర్ షాప్‌లు మూయిస్తారు. ఒకవైపు పోలీసులు, మరోవైపు ఆబ్కారీ పోలీసులు చెక్ పోస్టులు ఏర్పాటు చేసి ఎక్కడికక్కడ తనిఖీలు చేస్తున్నా ఆయా నియోజకవర్గాలకు మద్యం సరఫరా అవుతోంది. ప్రతి రోజు గ్రామాల వారీగా నాయకుల మద్యం, మాంసంతో విందు ఏర్పాటు చేస్తున్నారు. అన్ని శాఖల అధికారులు ఉండే మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోనే ఏకంగా ఇళ్లలోనే మద్యం నిల్వలు ఉంచి ఓటర్లకు రాత్రి సమయంలో పంపిణీ చేస్తున్నారు. ఎక్సైజ్ అధికారుల ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ అక్రమ మార్గాల్లో ఇతర రాష్ట్రాల నుంచి సైతం మద్యం కాటన్లను బారీగా జిల్లాకు దిగుమతి చేయడం జరుగుతోంది. గుట్టుగా గ్రామాల్లో బెల్టు దుకాణాలు సైతం నడిపిస్తున్నారు.

కనుల పండువగా కల్యాణోత్సవం

మల్దకల్: ఆదిశిలా క్షేత్రంలోని స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం సోమవారం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య కనుల పండువగా నిర్వహించారు. కల్యాణోత్సవం తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. అనంతరం స్వామి వారి పల్లకీ సేవ, రథోత్సవం నిర్వహించారు. ఆలయ ఈఓ సత్యచ్చంద్రారెడ్డి, అరవిందరావు, మధుసూదన్‌రెడ్డి, బాబురావు చంద్రశేఖర్‌రావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి కాంగ్రెస్ కృషి



ఊట్కూర్ మండలం అమీన్‌పూర్‌లో మాట్లాడుతున్న వాకిటి శ్రీహరి

మక్తల్/మాగనూర్/ఊట్కూరు: నియోజకవర్గ ప్రజలందరూ ఆశీర్వదించాలని కాంగ్రెస్ అభ్యర్థి వాకిటి శ్రీహరి కోరారు. సోమవారం సర్పంచ్ కల్పన, ఉప సర్పంచ్ వడ్డేపల్లి రాములు, వార్డు మెంబర్లు కలిసి కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం నిర్వహించిన ఊరేగింపులో ఆయన మాట్లాడుతూ.. పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందన్నారు. నర్వ మండల కేంద్రంలో వాకిటి లలిత ప్రచారం చేశారు. కార్యక్రమంలో బాలకృష్ణారెడ్డి, హన్మంతు, చంద్రకాంత్‌గౌడ్, బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి, ఎల్కోటి నారాయణరెడ్డి పాల్గొన్నారు.

వంటపొలాలకు సంగంబండ నీరు అందిస్తా

మాగనూర్ మండలంలోని ఏడు గ్రామాలకు సంగంబండ రిజయర్వాయర్ నీరు అందిస్తానని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వాకిటి శ్రీహరి అన్నారు. సోమవారం మండలంలోని పర్మన్‌దొడ్డిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు పాలించిన నేటికి పర్మన్‌దొడ్డికి కనీసం బీటీ రోడ్డు వేయలేదన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడుతా

మక్తల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తనను ఎమ్మెల్యేగా గెలిపంచాలని ఎమ్మెల్యే అభ్యర్థి వాకిటి శ్రీహరి అన్నారు. ఊట్కూర్ మండలంలోని తిప్రరాసిపల్లి, బాపూర్, వల్లంపల్లి, పగిడిమారి, అమీన్‌పూర్, ఓబులాపూర్ తదితర గ్రామాలలో ప్రచారం చేపట్టారు. బిజ్వార్ చెందిన దివ్యాంగుల సంఘం రాష్ట్ర నాయకుడు నాగేష్ గౌడ్, బీఆర్ఎస్ చెందిన శివశంకర్ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.



బాండ్ పేపర్‌పై సంతకం చేస్తున్న వాకిటి శ్రీహరి

బాండ్ పేపర్‌పై హామీ

మక్తల్‌లో పడమటి ఆంజనేయస్వామి దేవాలయంలో మక్తల్ కాంగ్రెస్ అభ్యర్థి వాకిటి శ్రీహరి పూజలు చేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగా గ్యారంటీలను అమలు చేస్తామని ఆలయంలో బాండ్ పేపర్‌పై సంతకం చేశారు.

అమరచింత: దేశంలోని ప్రజలకు శాంతియుత వాతావరణం కల్పిస్తూ.. వారి అభివృద్ధికి బాసటగా ఉన్న లౌకిక పార్టీలకే ఓటువేసి గెలిపించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, కర్నూల్ మాజీ ఎమ్మెల్యే గఫూర్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం రాత్రి సీపీఎం ఆధ్వర్యంలో రోడ్‌షో నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జబ్బార్, మండల కార్యదర్శి జీఎస్ గోపి, రాజు, ఆర్ఎస్ రమేష్, వెంకటేష్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మక్తల్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తా..



కల్వాల్‌లో మాట్లాడుతున్న వర్కటం జగన్నాథ్‌రెడ్డి

మక్తల్: నియోజకవర్గ ప్రజలు ఒక్కసారిగా ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని బీఎస్పీ అభ్యర్థి వర్కటం జగన్నాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం నర్వ మండలం కల్వాల్, రాయికోడ్, సీపురం, జిన్నారం, ఎక్లాస్‌పూర్, కన్మానూర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం గ్రామాలకు చేసిందేమీ లేదన్నారు. డబ్బు, మద్యంకు ప్రలోబాలకు లోను కాకుండా ఏనుగు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. అనంతరం పలు పార్టీలకు చెందిన కార్యకర్తలు బీఎస్పీలోకి చేరారు. ప్రజల ప్రజల కోసం అధికారం లేకున్నా సమస్యలను పరిష్కరించానన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలకు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. ప్రజలను మోసం చేసే పార్టీలను దూరంగా ఉండాలన్నారు.

భక్తిశ్రద్ధలతో గౌరీ నోములు



నారాయణపేట టపాసులు కాలుస్తున్న చిన్నారులు



దేవాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

నారాయణపేట రూరల్: ఇంటి ముంగిట దీపాల కాంతులు.. రహదారులపై టపాసుల మోతలు.. మరో పక్క మహిళలు ఇంట్లో గౌరీ నోములు నిర్వహించారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. వ్యాపార సముదాయాల్లో యజమానులు పూజలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా సోమవారం పౌర్ణమి వేడుకలు అంబరాన్ని తాకాయి. తెల్లవారుజామునే శైవక్షేత్రాలు భక్తులతో నిండాయి. పట్టణంలోని లింగయ్యగుడి, బారంబావి శివాలయం, ఔదుంబర్ గుడి, మండలంలోని కోటకొండ, భైరంకొండ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. శివలింగానికి పంచామృతాభిషేకం, బిల్వార్చన, విశేష పుష్పాలంకరణ చేపట్టి మహామంగళ హారతి, నైవేద్యం సమర్పించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. అదేవిధంగా శక్తిపీఠంలో ప్రత్యేక పూజలు నిర్వహించి దీపోత్సవం చేపట్టారు.

నర్వ: కార్తీకమాసం సందర్భంగా మండలంలో పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాల్లోని శివాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాల్లో మహిళలు దీపారాధన చేపట్టారు. లింగార్చన, పంచామృతాభిషేకం, బిల్వాష్టకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇళ్ల ఎదుట దీపాలను వెలిగించి టపాసులు కాల్చారు.

సత్యనారాయణస్వామి వ్రతం

మక్తల్: పట్టణంలో ఉమామహేశ్వర ఆలయంలో టీటీడీ ఆధ్వర్యంలో సామూహిక వ్రతాలు నిర్వహించారు. ఈశ్వరుడికి అభిషేకం ప్రత్యేక పూజలు చేసి మొక్కుల చెల్లించుకున్నారు. దాదాపు30 మంది దంపతులు పూజలు చేశారు. కార్తీకమాసం ప్రత్యేకతల, దీపోత్సవ కార్యక్రమాల వంటివి వివరించారు.



పెద్దకడ్మూర్ బాలబ్రహ్మేశ్వర ఆలయంలో భక్తుల పూజలు

కాంగ్రెస్ నాయకుల ప్రచారం



మరికల్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు

మరికల్: నారాయణపేట కాంగ్రెస్ అభ్యర్థి పర్ణికారెడ్డిని గెలిపించాలని సోమవారం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీ పథకలను అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో వీరన్న, కృష్ణయ్య, సూర్యమోహన్, హరీష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కరాటే విద్యార్థుల ప్రతిభ



మహబూబ్‌నగర్ క్రీడలు: ఈనెల 26, 27 తేదీల్లో జడ్చర్ల పట్టణంలో జరిగిన జాతీయ స్థాయి ఇన్విటేషన్ కరాటే పోటీల్లో కింగ్‌షోటోకాన్ కరాటే అకాడమీ విద్యార్థులు ప్రతిభచాటి పతకాలు సాధించినట్లు ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ తెలిపారు. ఈ పోటీల్లో వైట్‌బెల్టు విభాగంలో ఎండి.ఓవేస్, మెహ్విష్‌ఖాన్, బ్రౌన్ బెల్టులో సూఫియాన్‌అలీ, నవీన్‌కుమార్, మహ్మద్ సాబీర్‌పాష బంగారు పతకాలు, ఎండి.ఫర్హాన్‌అలీ రజత పతకం సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను జహంగీర్‌పాషతోపాటు అకాడమీ సభ్యులు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం



పులిమామిడిలో మాట్లాడుతున్న చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

ఊట్కూర్: బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని పులిమామిడిలో ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమానికై బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు. మళ్లీ అధికారంలోకి వస్తే తెల్లరేషన్ కార్డు ఉన్నవారికి సన్నబియ్యం సరఫరా చేస్తామని, రైతుబంధూ రూ.10వేల నుంచి రూ.16వేలకు పెంచుతామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అశోక్‌గౌడ్, వైస్ ఎంపీపీ ఎల్లాగౌడ్, సూర్యప్రకాశ్‌రెడ్డి, అరవింద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా ఖోఖో జట్ల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

కందనూలు: రాష్ట్రస్థాయి జూనియర్ ఖోఖో చాంపియన్‌షిప్ పోటీలకు ఉమ్మడి జిల్లా బాల, బాలికల జట్లను సోమవారం జిల్లాకేంద్రంలోని గీతాంజలి క్రీడా మైదానంలో జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. ఈ ఎంపికలకు ఉమ్మడి జిల్లా నుంచి దాదాపు 212 మంది క్రీడాకారులు హాజరు కాగా.. బాలికల జట్టుకు 15 మంది, బాలుర జట్టుకు 15 మంది చొప్పున ఎంపికయ్యారు. అనంతరం రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ కోశాధికారి విలియమ్స్ మాట్లాడుతూ అత్యంత ప్రతిభ కనబర్చి జిల్లా జట్టుకు ఎంపికైన బాలబాలికలకు అభినందనలు తెలిపారు. రాష్ట్రస్థాయి ఖోఖోలో ఉమ్మడి జిల్లాను ప్రథమ స్థానంలో నిలబెట్టాలని క్రీడాకారులకు సూచించారు. ఎంపికైన క్రీడాకారులకు వచ్చే నెల 1 నుంచి 7వ తేదీ వరకు కోచింగ్ క్యాంపు ఉంటుందని, అందరూ విధిగా హాజరుకావాలని చెప్పారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జూనియర్స్ బాల, బాలికల జట్లు వచ్చేనెల 8 నుంచి 10 వరకు నిజామాబాద్ జిల్లా నందిపేటలో జరిగే 42వ రాష్ట్రస్థాయి జూనియర్స్ క్రీడా పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఖోఖో అసోసియేషన్ ఇన్‌చార్జ్ నిరంజన్‌యాదవ్, కోఆర్డినేటర్ ప్రసాద్‌గౌడ్, ఎస్‌జీఎఫ్ మాజీ కార్యదర్శి వెంకటయ్య, సత్యనారాయణ, షంషేర్‌అలీ, వెంకటేష్, జిల్లా షూటింగ్ బాల్ ప్రధాన కార్యదర్శి పూర్ణచంద్, ప్రధాన కార్యదర్శి ప్రకాష్, కృష్ణ, యాదయ్య, రవి, భాస్కర్, చక్రవర్తి, వెంకటేష్, నవీన్‌నాయక్, మోహన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మోసపూరిత హామీలు నమ్మొద్దు



నర్వలో జలంధర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరుతున్న ఊట్కూర్ మండల నాయకులు

ఆత్మకూర్: మోసపూరిత హామీలు ఇచ్చిన బీఆర్ఎస్, కాంగ్రెస్ నమ్మొద్దని, అభివృద్ధేని సంకల్పించే బీజేపీకి మద్దతు తెలపాలని బీజేపీ మక్తల్ నియోజకవర్గ అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి అన్నారు. సోమవారం మున్సిపాలిటీ కేంద్రంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా కర్ణాటక రాష్ట్రం కోలార్ ఎంపీ మునిస్వామి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండయ్యతో కలిసి రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎమ్మెల్యే చిట్టెం అభివృద్ధిని తిరోగమం పట్టించారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ అమలు చేయలేని హామీలతో కర్ణాటకలో గద్దెనెక్కి ప్రజలకు తిప్పలు పెడుతుందని ఆరోపించారు.

సబ్బండ వర్గాల అభ్యున్నతే లక్ష్యం

సబ్బండ వర్గాల అభ్యునతే లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో సంక్షేమ పథకాలతో ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుతుందని, రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు ఖాయమన్నారు. ఈనెల 30న జరిగే అసెం ఎన్నికల్లో అధికార బీఆర్ఎస్‌కు, కాంగ్రెస్ పార్టీలకు బుద్ధి చెప్పాలని, నియోజకవర్గ అభివృద్ధికి కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి బీజేపీ గెలుపునకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి అజ్జపాగ లక్ష్మణ్, ఊట్కూర్ భాస్కర్, అశ్విన్‌కుమార్, మహేశ్వరి, నాగలక్ష్మి, భార్గవి, రేచింతల శ్రీను, నాగేందర్‌రెడ్డి, చిన్ననర్సింహ, గాడిశేషు, రఘు, బాలకృష్ణ, వెంకట్రాములు, రాము, అశోక్, యశ్వంత్, సమద్, ఆదర్శ్, కిషోర్, శ్యామ్ తదితరులు ఉన్నారు.

నర్వ: మక్తల్ నియోజకవర్గంలో బీజేపీ పార్టీ గెలుపును ఎవ్వరూ అడ్డుకోలేరని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి అన్నారు. సోమవారం నర్వలోని ఆయన స్వగృహంలో ఊట్కూర్ మండలంలోని కొల్లూర్, మందిపల్, బిజ్వార్, పులిమామిడి గ్రామాల నుంచి 100 మంది కార్యకర్తలు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని జోస్యం చెప్పారు.



ఆత్మకూర్‌లో మాట్లాడుతున్న జలంధర్‌రెడ్డి, ఎంపీ మునిస్వామి, కొండయ్య

నర్వ: మండల అభివృద్ధికి ఎంతో కృషి చేశానని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి మండల కేంద్రంలో ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రజలు మంగళహారతులతో, డప్పు వాయిద్యాలతో స్వాగతం పలికారు. అనంతరం అంబేడ్కర్ చౌరస్తాలో ఆయన మాట్లాడుతూ నర్వ అభివృద్ధిలో భాగంగా కస్తూర్బా గురుకుల పాఠశాల ఏర్పాటుకు రెండు ఎకరాల స్థలం ఇవ్వడంతోనే నేడు వందల మంది బాలికలు విద్యనభ్యసిస్తున్నారన్నారు. కొత్తపల్లి, లక్కర్‌దొడ్డి, జక్కన్నపల్లి గ్రామాలకు తన సొంత ఖర్చులతో రోడ్డు వేశానన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పెద్దింటి సంధ్య, ఉప సర్పంచు నర్సింహారెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, నాయకులు అయ్యన్న, పెద్దింటి ఆంజనేయులు, కుర్వ సత్యం, శశిధర్‌రెడ్డి, గంగాధర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కోటిలింగాల ప్రతిష్ఠోత్సవం ప్రారంభం

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి శివారులో గల శ్రీదత్తకోటి లింగేశ్వరస్వామి ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న కోటి లింగాల ప్రతిష్ఠోత్సవ కార్యక్రమాన్ని శివకోటి యంత్రాల ద్వారా కార్తీక సోమవారం వైభవంగా ప్రారంభించారు. మొదటి రోజు 20వేల శివకోటి యంత్రాల ద్వారా కోటిలింగాల ప్రతిష్ఠించాలనే సంకల్పంతో రోజుకు వెయ్యి మంది భక్తుల చొప్పున ఒక్కొక్కరికి 20యంత్రాల ద్వారా పదకొండు వేల లింగాలు ప్రతిష్ఠించే విధంగా ఏర్పాటు చేశామని ఆలయ నిర్వాహకులు శేఖరయ్య తెలిపారు. రుద్రహోమం అనంతరం 20 శివకోటి యంత్రాలకు రుద్రాభిషేకం చేసి భక్తులతో ప్రతిష్ఠించారు. కోటింగాల ప్రతిష్ఠోత్సవం 15రోజుల పాటు ఉంటుందని, భక్తులు పాల్గొని స్వామి వారికి కృపకు పాత్రులకు కావాలని నిర్వాహకులు కోరారు.